ప్రజాశక్తి
శనివారం 18 మార్చి 2023
5
అనంతపురం





ఘటనా స్థలంలోనే మృతి చెందిన నలుగురు వ్యక్తులు

హోరాహోరీ..!

- వైసిపి, టిడిపి మధ్య తీవ్రమైన పోటీ
- ఉత్కంఠతను రేపుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్
- 8వ రౌండ్ వరకు వైసిపి అభ్యర్థికి మెజార్టీ
- నేడు తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం



జెఎన్‌టియులో కౌంటింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు హోరాహోరీగా సాగుతోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల మధ్య నువ్వా... నేనా. అన్నట్టుగా వస్తున్న ఫలితాలు ఉత్కంఠతను రేకెత్తిస్తున్నాయి. అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో గురువారం ఉదయం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు శుక్రవారం రాత్రి అయినా పూర్తవలేదు. అర్ధరాత్రి వరకైనా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపే సాగింది. ఈ లెక్కింపులోనూ ఎవరికీ పోలైన ఓట్లలో 50 శాతం రానందున రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు శుక్రవారం రాత్రి నుంచి కొనసాగుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,30,124 ఓట్లు ఉంటే 2,44,307 ఓట్లు పోలయ్యాయి. శుక్రవారం రాత్రి వరకు ఎనిమిది రౌండ్లు పూర్తయ్యాయి. ఇందులో 1,92,018 ఓట్లు లెక్కించారు. ఇందులో 15,104 ఓట్లు చెల్లని ఓట్లు కాగా, తక్కిన ఓట్ల లెక్కింపు జరిగింది. ప్రారంభం నుంచి కూడా ప్రతి రౌండులోనూ స్వల్ప మెజార్టీలే అటు వైసిపికిగానీ, ఇటు టిడిపికిగానీ వస్తూ వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజు మూడవ స్థానంలో నిలుస్తూ వస్తున్నారు. ఈ ముగ్గురి మధ్యనే ఓట్లు పోలయ్యాయి. తక్కిన 47 మంది అభ్యర్థులకు నామ మాత్రపు ఓట్లే వచ్చాయి.

వివాదం రేపేందుకు అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు

హోరాహోరీగా సాగుతున్న ఈ ఓట్ల లెక్కింపు సమయంలో అధికార వైసిపి నేతలు కొందరు పలు దపాలుగా కౌంటింగ్ హాలులో వివాదం రేపేందుకు ప్రయత్నాలు చేశారు. గురువారం రాత్రి సమయంలో నవయుగకాలనీ ఇతర ప్రాంతాల నుంచి కొంత మంది యువకులను కౌంటింగ్ హాలుకు రప్పించి ఎటువంటి కారణం లేకుండానే ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు సకాలంలో జోక్యం చేసుకుని వచ్చిన వారిని బయటకు తీసుకెళ్లడంతో కౌంటింగ్‌కు అంతరాయం కలుగకుండా సాఫీగా సాగింది. శుక్రవారం నాడు వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి నేరుగా ఎన్నికల అధికారులపైనే ఆరోపణలు చేయడం చర్చనీయాంశమవుతోంది. కౌంటింగ్ హాలా లేక టిడిపి కార్యాలయమా అని వ్యాఖ్యలు చేశారు. దీన్ని విపక్ష పార్టీల నేతలు తప్పుబట్టారు. ఎన్నికల సంఘం అనుమతి పొందిన వారు మాత్రమే కౌంటింగ్ హాలులోకి అనుమతించడం జరుగుతోంది. ఎవరూ లేకుండా ఉండకూడదనడం సరైంది కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రకంగా చిన్న విషయానికి వివాదాస్పదంచేసే ప్రయత్నాలను అధికారపార్టీ చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండో ప్రాధాన్యతనే నిగ్గు తేల్చేనా

మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ 50 శాతానికి మించి ఓట్లు వచ్చే సూచనలు కనిపించడం లేదు. దీంతో ఓట్ల లెక్కింపు శనివారం కూడా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారుల ముందు నుంచే మూడు రోజులు కౌంటింగ్ జరిగే విధంగా ఏర్పాటు చేసియున్నారు. మొదటి ప్రాధాన్యత పూర్తవడంతో రెండో ప్రాధాన్యతలో విజయం ఎవరికి వరిస్తుందన్నది చూడాల్సి ఉంది. తుది ఫలితం శనివారం నాడు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పట్టభద్రుల ఓట్లు, మెజార్టీ రౌండ్లు వారీగా

రౌండ్	టిడిపి	వైసిపి	పిడీఎఫ్	మెజార్టీ
1	8801	9664	1838	863 (వైసిపి)
2	8851	9855	1714	1004(వైసిపి)
3	9277	9353	1980	76(వైసిపి)
4	9194	9216	2043	22(వైసిపి)
5	8988	8999	2373	11(వైసిపి)
6	8980	9023	2297	43 (వైసిపి)
7	9663	9026	1683	637(టిడిపి)
8	9475	9542	1326	67(వైసిపి)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత ఎంవి.రామచంద్రా రెడ్డి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి మద్దతుతో పోటీ చేసిన ఎంవి.రామచంద్రారెడ్డి విజయం సాధించారు. శుక్రవారం నాడు జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన మీడియా ప్రాంగణం వద్ద కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆయనకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గానికి జరిగిన ఎన్నికల్లో 25,879 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 608 ఓట్లు చెల్లని ఓట్లుపోగా 25,271 ఓట్లను వాలిడ్‌గా గుర్తించారు. రెండు రౌండ్లలో జరిగిన ఈ ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి వైసిపి మద్దతుదారుడు ఎంవి.రామచంద్రారెడ్డికి 8846 ఓట్లు, ఎపిటిఎఫ్ మద్దతుదారుడిగానున్న ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 6853 ఓట్లు, పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి 4162 ఓట్లు , స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన డాక్టర్ అనిల్ వెంకట ప్రసాద్‌రెడ్డికి 3212, జీవినారాయణరెడ్డికి 1345 ఓట్లు వచ్చాయి. తక్కిన వారికి నామ మాత్రపు ఓట్లే వచ్చాయి. మొత్తం పోలైన ఓట్లలో ఎవరికి 50 శాతం దాటకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తక్కువ ఓట్లు వచ్చిన వారి నుంచి ఎలిమినేషన్ ప్రారంభించారు. ఆఖరి ఎలిమినేషన్ జరిగిన పిడిఎఫ్ అభ్యర్థి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి 3867 ఓట్లు ప్రాధాన్యత బదిలీ అనంతరం కోల్పోయి ఓట్లు ఉన్నాయి. తక్కిన ఓట్లలో ఎంవి.రామచంద్రారెడ్డికి 10,787 ఓట్లు రాగా, శ్రీనివాసరెడ్డికి 10618 ఓట్లు వచ్చాయి. ఇద్దరిలోనూ ఎవరికి 50 శాతానికిపైగా ఓట్లు రానప్పటికీ ఎలిమినేషన్ పూర్తయ్యే సమయానికి అత్యధిక ఓట్లు కలిగిన ఎంవి.రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించారు. 169 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఆయన బయటపడ్డారు.



ఎంవి.రామచంద్రారెడ్డి



డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న ఎంవి.రామచంద్రారెడ్డి

బత్తలపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

బొలేరో, ఆటో ఢీ.. ఆరుగురు దుర్మరణం
మరో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్, బత్తలపల్లి

వివిధ పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వారివారి స్వగ్రామాలకు మరో 15 నిమిషాల్లో చేరుకోవాల్సిన సమయంలో ఘోరరోడ్డు ప్రమాదం రూపంలో మత్యువు కబళించింది. ఓ ఆటో బొలెరో వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మత్యువాత పడిన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లమర్రి సమీపంలో శుక్రవారంరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన బత్తలపల్లి నుంచి 10 మంది ప్రయాణికులతో ఆటో ధర్మవరంకు బయలుదేరింది. ఆటో ఫోట్లమర్రి సమీపంలోకి రాగానే ధర్మవరం నుంచి బత్తలపల్లికి వైపునకు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘోరప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ తోపాటు మరో ముగ్గురు అక్కడికక్కడే మతిచెందారు. మరోకరు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో మతిచెందారు. మతిచెందిన వారిలో ధర్మవరానికి చెందిన ఆటో డ్రైవర్ నరసింహులు(25), గొట్లూరుకు చెందిన ఈశ్వరయ్య(35), ముదిగుబ్బ మండలం నల్లాయకుంటపల్లికి చెందిన గాలి నారాయణస్వామి(48), పోట్లమర్రికి చెందిన మల్లేశ్(35) అక్కడికక్కడే మతిచెందగా ధర్మవరంలోని కొత్తపేటకు చెందిన హాజీపీరా(54), మరో గుర్తుతెలియని వ్యక్తి(51) ఆర్డీటీ ఆస్పత్రిలో మతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్ కుమార నరసింహులతోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న రంగస్వామి, ఆరేళ్ల చిన్నారి, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వైద్య చికిత్సల కోసం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్ సంఘటనాస్థలానికి చేరుకుని జరిగిన ప్రమాచాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

బత్తలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బత్తలపల్లి నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న బొలేరో, ఆటోలు ఢీకొని ఏడుగురు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రమాద సమయంలో సహాయ చర్యలు చేపట్టిన స్థానికులకు సిపిఎం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అకాల వర్షం..పంట నష్టం..!

బొమ్మనహాల్‌లో తడిసిన మిరప

ప్రజాశక్తి-బొమ్మనహల్

అకాల వర్షం.. పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. శుక్రవారం మధ్యాహ్నం బొమ్మనహాల్‌లో కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో పంటలు నీటిలో తడిసాయి. మండల పరిధిలోని గోవిందవాడ, దర్గా హొన్నూరు, బొల్లన్నగుడ్డం, కళుహొల, దేవనహళ్లి, కష్ణాపురం, ఎల్బీనగర్, కురువల్లి, చంద్రగిరి, దేవగిరి, ఉద్దేహళ్, లింగదహాల్ గ్రామాల్లో మిరప పంట తడిసిపోయింది. పంట ఆరబెట్టుకున్న సమయంలో వర్షం రావడంతో నీటిలో తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిరప కోసి పొలాల్లో ఆరబోసుకున్న సమయంలో వర్షం రావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలల పాటు సాగు చేసి కోత కోసిన పంట గంట వర్షంతో తుడిచిపెట్టుకుని పోయిందన్నారు. మండలంలో పంటలు ఆరబోసుకునేందుకు గోడౌన్లు లేక రైతులు పొలాల్లోనే ఎండబెట్టుకుంటున్నారు. దీంతో ఇలా వర్షం వచ్చిన ప్రతి సారి పంట మొత్తం తడిసిపోతోంది.

పూర్తిగా నష్టపోయాం
కురుబ సుంకన్న, వన్నూరప్ప, గోవిందవాడ గ్రామం.

పంట చేతికొచ్చిన సమయంలో వర్షం తీవ్రంగా ముంచేసింది. కౌలు, ఇతర పంట సాగు కోసం రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాం. పంట చేతికొచ్చిన సమయంలో ఇలా వర్షంతో తడిసి పూర్తిగా నష్టపోయాం. తడిచిపోయిన మిరప రంగు మారితే కొనేందుకు వ్యాపారులు ఎవరూ ముందుకురారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులు అందరికి పూర్తి స్థాయిలో పంట నష్టపరిహారం చెల్లించాలి.



తడిసిన పంటలపై పట్టలు కప్పుతున్న రైతులు

సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి ఒప్పందం

సంతకాలు చేసిన యోగి వేమన, అనంత జెఎన్‌టియు అధికారులు

అనంతపురం : సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి వైఎస్‌ఆర్ కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయం, అనంతపురం జెఎన్‌టియు మధ్య శుక్రవారం అవగా హన ఒప్పందం కుదిరింది. జెఎన్‌టియు ఉప కులపతి రంగజనార్ధన సమక్షంలో జెఎన్‌టియు, యోగివేమన విశ్వవిద్యాల యాల కుల సచివులు వై.వి వెంకట సుబ్బయ్య, సి.శశిధర్ ఒప్పంద పత్రాల పై సంతకాలు చేశారు ఈ సందర్భంగా రంగ జనార్ధన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఎన్విరాన్‌మెంటల్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ వారితో దేశంలోనే 17వ లీడ్ బొటానికల్ గార్డెన్‌గా పేరుపొందిన యోగి వేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్, అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకుల పరిశోధన కార్యకలాపాలు, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి ఈ ఒప్పందం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బొటానికల్ గార్డెన్, లేబొరేటరీల సందర్శన సౌకర్యాల ఏర్పాటు, రెండు సంస్థల మధ్య ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, పరిశోధన పనుల కోసం విద్యార్థుల జ్ఞాన, ఆలోచనల మార్పిడి, రెండు ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి కోసం దేశీయ మొక్కల పెంపకంలో సలహాలు, సూచనలు ఇచ్చి పుచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతేగాకుండా సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు,వర్క్‌షాప్‌ల కోసం అధ్యాపకులను రిసోర్స్ పర్సన్‌లుగా వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవియు లీడ్ బొటానికల్ గార్డెన్ బాధ్యులు ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైవియు వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ఆచార్యులు నాగరాజు, వైవియు పీజీ కళాశాల ఉప ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్, రహదారి భవనాల విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెఎన్‌టియు ఇంజినీర్ అస్లాం బాషా, రమణ, వైవియు పరీక్షల నియంత్రణ అధికారి ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ ఎస్‌వి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

1544 మెట్రిక్ టన్నుల పప్పుశెనగ కొనుగోలు

అనంతపురం : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14 సెంటర్లలో ప్రభుత్వం మద్దతు ధరతో రైతులు పండించిన పప్పుశెనగ పంటను కొనుగోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వారీగా వ్యవసాయ శాఖ రైతులను మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న రైతుల నుంచి పంటను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 860 మంది రైతుల నుంచి 1544 మెట్రిక్ టన్నుల పప్పుశెనగ సేకరించినట్లు తెలిపారు.

జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర

తనకల్లు మండలం చీకటిమానిపల్లి వద్ద ఘనస్వాగతం
కందికుంట ఆధ్వర్యంలో భారీగా తరలిన టిడిపి శ్రేణులు-నేటి నుంచి జిల్లాలో పాదయాత్ర

ప్రజాశక్తి-కదిరి టౌన్/తనకల్లు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శ్రీ సత్యసాయి జిల్లాలోకి ప్రవేశించింది. అన్నమయ్య జిల్లా నుంచి శుక్రవారం సాయంత్రం తనకల్లు మండలం చీకటిమానినపల్లి వద్ద యాత్ర జిల్లాకు చేరుకుంది. దీంతో కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 300 వాహనాల్లో కార్యకర్తలు వచ్చి ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రులు పరిటాల సునీత, కొల్లు రవీంద్ర, కదిరి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి, అంబిక లక్ష్మినారాయణ, తెలుగు యువత ఎస్.బాబ్జాన్, ఎల్.నారాయణచౌదరి, ఎంఎస్.రాజు తదితరులు స్వాగతం పలికారు. పాదయాత్ర జిల్లాకు చేరుకున్న అనంతరం చీకటిమానిపల్లి వద్ద గల విడిది కేంద్రానికి లోకేష్ చేరుకున్నారు. శనివారం ఉదయం 8:30గం॥కు పాదయాత్ర ప్రారంభం కానుంది. గ్రామ సమీపంలోని గంగసానిపల్లి వద్ద టమోటా రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహిస్తారు. బిసినవారిపల్లి వద్ద బలిజ కులస్తులతో సమావేశంలో పాల్గొంటారు. కొక్కంటి క్రాస్‌కు చేరుకుని ఎస్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. మండ్లిపల్లి వద్ద స్వాగత కార్యక్రమం తర్వాత తనకల్లు మండల కేంద్రంలో ఎస్సీలతో ముఖాముఖి ఉంటుంది. అక్కడి నుంచి నల్లచెరువు మండల పరిధిలోని చిన్న పల్లోల్లపల్లికి పాదయాత్ర చేరుకుంటుంది. రాత్రి విడిది కేంద్రం వద్ద మొదటి రోజు పాదయాత్ర ముగియనుంది. లోకేష్ పాదయాత్ర విజయవంతం అయ్యేందుకు ఇప్పటికే టిడిపి నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



జిల్లాలోకి ప్రవేశించిన అనంతరం ప్రజలకు అభివాదం చేస్తున్న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేస్



పాదయాత్రలో లోకేష్‌తో కలిసి నడుస్తున్న మాజీమంత్రి పరిటాల సునీత, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గెజిట్ ప్రకారం సుంకం వసూలు చేయాలి

గుంతకల్లు : మున్సిపాలిటీ పరిధిలోని చిరు వ్యాపారులతో గెజిట్ ప్రకారమే సుంకం వసూలు చేయాలని సిఐటియు అనుబంధ తోపుడుబండ్ల యూనియన్ నాయకులు తిమ్మప్ప కోరారు. శుక్రవారం ఆ మేరకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లకు ఇరువైపులా వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు సుంకం చెల్లించే టెండర్లకు మున్సిపల్ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారన్నారు. ఐతే ఆ షెడ్యూల్లో టెండరును దక్కించుకున్న కాంట్రాక్టర్ గెజిట్ ప్రకారమే సుంకం రుసుము వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కొంతమంది టెండర్లు వేసిన తర్వాత అధిక సుంకం వసూలు చేస్తూ చిరు వ్యాపారులపై భారాలు వేశారన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చూడాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోపుడుబండ్ల యూనియన్ నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

పెద్దపప్పూరు : చిన్నపప్పూరు మండల సమీపంలో వెలసిన పప్పూరమ్మ ఆలయ అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం అమ్మవారి విగ్రహాన్ని ఆలయానికి పక్కనున్న భవనంలో ఉంచారు. ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసి అనంతరం అమ్మవారి విగ్రహాన్ని అందులో ప్రతిష్టాపన చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామ్మూర్తి రెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, సర్ సివి రామన్ విద్యాసంస్థల అధినేత భాస్కర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

రొద్దం : మండలంలోని పాతర్లపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో జింక మృతిచెందింది. మండల కేంద్రానికి చెంది ఫకృద్దీన్ గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణ మయ్యాడు. మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో పాతర్లపల్లి సమీపంలో ఫారం కోళ్ల షెడ్ సమీపానికి రాగానే జింక అడ్డు రావడంతో జింకను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. ఫకృద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న జమేదార్ నాగరాజు, పోలీసులు శివ కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన జింకను పెనుగొండ ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ అధికారిపై దాడి అమానుషం

కదిరి టౌన్ : కాకినాడలో విధి నిర్వహణలో ఉన్న వాహన తనిఖీ అధికారి పై దాడి అమానుషమని కదిరి మోటార్ వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్ అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా అధికారిపై వాహన దారుడు అమానుషంగా దాడి చేయడం అమానుషమన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అధికారి చావు బతుకుల మధ్య ఉన్నాడన్నారు. ఈ దాడిని ఖండిస్తూ వాహనాల తనిఖీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జిలు తగిలించుకొని నిరసన తెలిపారన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి : సిఐటియు

హిందూపురం : అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న డిమాండ్‌తో ఈ నెల 20న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప కోరారు. ఈ విషయంపై శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అధికారికి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీష, యూనియన్ నాయకులు పద్మావతమ్మ, సుమియా తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో పంటనష్టం

కొత్తచెరువు : గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలోని కొడపగాని పల్లి, ఇండ్ల వెంకటంపల్లి, తలమర్ల, మీర్జాపురం, బండ్ల పల్లి,గ్రామాలలో సాగుచేసిన టమోటా, దోస, కలంగిర, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఇండ్ల వెంకంపల్లి రైతు రామ్ గోపాల్ రెడ్డి రూ. 2.10 లక్షలు ఖర్చు చేసి నాలు ఎకరాల పొలంలో కట్టెలు కట్టి టమోటా పంటను సాగు చేశాడు. కోత కోసే సమయంలో అకాల వర్షాలకు దాదాపు ఒకటిన్నర ఎకరాలో టమోటా పంట దెబ్బతింది. దీంతో తనకు లక్ష రూపాయల దాకా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. అదేవిధంగా మీర్జాపురం గ్రామంలో రూ.8 లక్షలు వెచ్చించి మామిడి తోటను కొనుగోలు చేశానని యర్లంపల్లి రామచంద్ర తెలిపారు.రాత్రి కురిసిన గాలి వానకు మామిడికాయలు రాలిపోయాయని దీంతో పంట నష్టం దాదాపు రూ.1.80 లక్షల దాకా ఉంటుందని ఆయన వాపోయారు.

మహిళా మార్ట్‌లో బలవంతపు అమ్మకాలు

నార్పల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వెలుగు మహిళా మార్ట్‌లో మహిళా సంఘాల సభ్యులపై అధికారులు ఒత్తిడి తెచ్చి బలవంతపు అమ్మకాలు చేస్తున్నారు. ఉగాది పండుగకు రూ.10 వేలు సరుకులు మహిళా మార్ట్‌లో కొని తీరాల్సిందేనని ప్రతి మహిళా సంఘం లీడర్‌కు యానిమేటర్ల ద్వారా వెలుగు అధికారులు దగ్గరుండి ఫోన్లు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. దీన్ని బయటకు చెప్పకోలేక మహిళా సంఘాల లీడర్లు సతమతవుతున్నారు.

పండుగకు రూ.10 వేలు సరుకు కొనాల్సిందేనని
మహిళా సంఘాలకు అధికారుల హుకుం
బయటకు చెప్పకోలేక సతమతమవుతున్న సభ్యులు

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల కేంద్రంలో కొద్ది రోజుల క్రితం వెలుగు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. గతంలో మార్ట్ ఏర్పాటును మహిళా సంఘాల సభ్యులు వ్యతిరేకించారు. అయితే ఉన్నతాధికారుల నుండి ఒత్తిడి రావడంతో మిన్నకుండిపోయారు. స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేతుల మీదుగా మార్ట్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం అధికారులు మార్ట్‌లో వస్తువుల అమ్మకాలపై మహిళా సంఘాల సభ్యులకు టార్గెట్ విధిస్తున్నారు. పండుగను అడ్డుపెట్టుకుని టార్గెట్ ఎలాగైనా పూర్తిచేయాలని స్థానిక అధికారులు కంకణం కట్టుకున్నారు. మహిళా సంఘాలపై ఒత్తిడి తెస్తున్నారు. ఉగాది పండుగకు ప్రతి మహిళా సంఘం రూ.10 వేలు సరుకులు మహిళా మార్టులో కొన్నట్లు బిల్లు చూపితేనే భవిష్యత్తులో ఆ సంఘాలకు రుణాలు మంజూరు చేస్తామని.. లేదంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయటకు చెప్పకోలేక సతమతం..

దీనిపై బహిరంగంగా మాట్లాడితే తమకు రుణాలు రాకుండా చేస్తారేమోనని మహిళా సంఘాల సభ్యులు సతమతమవుతున్నారు. మార్టులో నాణ్యమైన వస్తువులు ఏర్పాటు చేసి ఎవరైనా ఇష్టపూర్వకంగా కొనే విధంగా చూడాలే కాని బలవంతంగా అంటగట్టడం సరికాదని వాపోతున్నారు. స్థానిక దుకాణాల్లో సరుకులు



నార్పల మండల కేంద్రంలోని మహిళా మార్ట్

అప్పుగా ఇస్తారని.. నిదానంగా డబ్బు చెల్లిస్తామని.. మార్టులో రూ.10 వేలు సరుకులు కొనాలని ఒత్తిడి తెస్తే అంత డబ్బు ఎక్కడ నుంచి తేవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి మహిళా సంఘాలపై ఒత్తిడి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళా మార్ట్‌లోనే ఎపిఎం..

అధికారులు ఇచ్చిన టార్గెట్ ఎలాగైనా పూర్తి చేయాలని వారం పది రోజులుగా ఎపిఎం తిప్పమ్మ మహిళా మార్ట్‌లోనే మకాం వేసినట్లు తెలుస్తోంది. వెలుగు కార్యాలయంలో విధులను వదిలిపెట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్ట్‌కే పరిమితమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నారు.

పన్నులపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

నగర మేయర్ మహమ్మద్ వసీం



అవగాహన కల్పిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఆస్తి పన్నులు, ఖాళీ జాగా పన్నులపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి లతో కలిసి నగరంలోని కమలానగర్‌లో వ్యాపారులకు పన్నులపై వడ్డీ మాఫీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ ఆస్తి పన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలను మార్చి 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను పాత బకాయిలను చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబు సాలెహా, కమల్ భూషణ్, అనిల్ కుమార్ రెడ్డి, బాబా ఫకృద్దీన్, మున్సిపల్ సిబ్బంది సతీష్, మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి : పంచాయతీకి సంబంధించిన పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఈవో ఎర్రిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్ను, కొళాయి పన్నులతో పాటు ఇతర బకాయిలు ఉన్నవారు ఈనెల 20 లోగా చెల్లించి తగిన రసీదు పొందాలన్నారు.

అనంతలో మాసివ్ క్లీనింగ్ ప్రోగ్రాం



రోడ్లు శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటరీలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శుక్రవారం మాసివ్ క్లీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. 2022-2023 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఈ ప్రోగ్రాం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో 80 మంది వాలంటరీలు రైల్వే స్టేషన్ ఆవరణ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. దీని ప్రధాన ఉద్దేశం శుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమంలో ఎస్కె యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్ పాల్గొని రైల్వేస్టేషన్, బస్టాండ్లు, గవర్నమెంట్ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, యూనిట్-1 విభాగాధిపతి నగరూరు రసూల్ మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రం చేసుకోవడం వల్ల అనేక రకాల జబ్బుల నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. మంచి ఆరోగ్యాన్ని మించిన ఐశ్వర్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కె యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆదినారాయణ రెడ్డి, వలి, డా, ఎన్.ఓబిరెడ్డి, వాలంటరీలు అబ్దుల్, బ్రహ్మ, వంశీ, సాంబ, అనిల్, జ్ఞానేష్, అశోక్, స్రవంతి, బాలు, యమున, రాకేష్, కిరణ్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలైన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బోనస్, సమ్మె కాలపు వేతనాలు, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. పిఎబిఆర్ డ్యామ్ వద్ద శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు ప్రభుత్వాలు శాశ్వత ప్రాతిపాదికన బడ్జెట్ కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. అలాచేయక పోవడంతో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందని దుస్థితి నెలకొందన్నారు. నెలల తరబడి వేతనాలు బకాయిలు పడుతున్నాయని తెలిపారు. వేతనాలు ఇవ్వమంటే కాంట్రాక్టర్, అధికారులు ఒకరిపై ఒకరూ చెప్పుకుంటూ కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. సమ్మెలు చేస్తే తప్ప స్పందించని దుస్థితి ఏర్పడిందన్నారు. గత సమ్మె సమయంలో ప్రభుత్వం, అధికారులు చర్చలు జరిపి పలు హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీలు అమలు చేయలేదన్నారు. గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బోనస్, 2 నెలల వేతనాలు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు సమ్మెచేస్తున్న సమయంలో వేతనాలు ఇచ్చి సరిపెట్టేందుకు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, వివిధ ప్రాజెక్టుల నాయకులు శ్రీరాములు, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆర్‌డి ఆఫీస్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు సిఐటియు అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డి) కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎటిఎం నాగరాజు అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులర్ కార్మికులకు సిపిఎస్ రద్దు చేసి జిపిఎఫ్ అకౌంట్స్ తెరవాలని, హెల్త్ కార్డులు, బకాయి సరెండర్ లీవ్ అమౌంట్ ఇవ్వాలని మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలతో పాటు హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, 60 ఏళ్ల పేరుతో తొలగించిన ఇంజినీరింగ్ కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. మలేరియా, కోవిడ్, గార్బేజ్ కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి ఆప్కాస్ లో చేర్చాలన్నారు. వారికి ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్ కార్మికులకు టైం స్కేలు, కరువు భత్యం, డిఎ, ఐఆర్ లతోపాటు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదివరకే చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ డెత్ బెనిఫిట్స్ అందేలా చూడాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. నగర విస్తీర్ణం, జనాభాకి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డి పివివిఎస్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజమోహన్, ఓల్డ్‌టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, అధ్యక్షులు గురురాజా, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే.తిరుమలేశు, ఇంజినీరింగ్ కమిటీ సభ్యులు లోకేష్, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, అధ్యక్ష కార్యదర్శులు అంజి, ఓన్నూరప్ప, క్రిష్ణ, శామ్యూల్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని సత్య సాయి వాటర్ సప్లై యూనియన్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలో ఉన్న సత్యసాయి వాటర్ సప్లై పంపు హౌస్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు కార్మికులకు రావాల్సిన బోనస్ లీవ్‌లు, గ్రాట్యుటీ చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. నెలల తరబడి జీతాలు లేకున్నా ప్రజల దాహార్తిని తీరుస్తున్న కార్మికుల కుటుంబాల గురించి మాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా 13 నియోజకవర్గాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, శీనప్ప, బొజ్జప్ప, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

సన్ రే ఆసుపత్రిలో అరుదైన చికిత్స

20 సంవత్సరాల యువతికి త్రాంబో లైసిస్ చికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సన్ రే ఆసుపత్రి వైద్యులు అరుదైన చికిత్స అందించి వైద్య విధానంలో నూతన ఒరవడి సృష్టించారు. ప్రధాన నగరాలకు వెళ్లకుండా ఖరీదైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతోనే సన్ రే ఆసుపత్రి వైద్యులు అందించారు. 20 సంవత్సరాల అనూష గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ సన్ రే ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సురేంద్రబాబును సంప్రదించారు. ఆమెకు త్రాంబో లైసిస్ చికిత్స అవసరమయింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువతికి తక్కువ ఖర్చుతో వైద్యం అందించేందుకు వైద్యులు ముందుకొచ్చారు. అనంతపురం జిల్లాలో ప్రప్రథమంగా చికిత్స అందించడం సంతోషకరంగా ఉందని వైద్యులు సురేంద్రబాబు, రోహిత్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ డయాలసిస్ పేషెంట్ అనూష తమను ఆశ్రయించిందన్నారు. ఎవి ఫిస్టులా రెండు గంటల నుంచి పనిచేయడం లేదని తెలుసుకుని నిర్ధారణ పరీక్షల ద్వారా రక్తం గడ్డకట్టినట్లు గుర్తించామన్నారు. వెంటనే గడ్డకట్టిన రక్తాన్ని కదిలించేందుకు ఉన్న అవకాశాలను వివరించామన్నారు. ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో త్రాంబో లైసిస్ అనే పద్ధతి ద్వారా మార్క్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్ సహకారంతో నాలుగు గంటల్లో ఫిస్టులా తిరిగి పనిచేసే విధంగా చికిత్స అందించామని వెల్లడించారు. అనూషకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం ఉందన్నారు. కిడ్నీ మార్పిడి అనంతరం ఆమె సుఖమయ జీవితం గడపవచ్చునని తెలియజేశారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. డయాలసిస్ రోగులు ఎవి ఫిస్టులా రోజులో కనీసం మూడు నుంచి నాలుగు సార్లు పనిచేస్తుందా లేదా అని పరీక్షించుకోవాలని తెలిపారు. ఒకవేళ పనిచేయని పక్షంలో వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి మేనేజర్ వేణు, మార్కెటింగ్ మేనేజర్ విశ్వ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

భవన నిర్మాణ మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి-యాడికి

భవన నిర్మాణ పనులకై వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు మృత్యువాతన పడిన సంఘటన మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. యాడికి ఎస్సీ కాలనీకి చెందిన కంబగిరి భార్య కుల్లాయమ్మ తనతో పాటు మరో 15 మందితో కలిసి భవన నిర్మాణ పనులకు ఉప్పలపాడు గ్రామానికి వెళ్లింది. అక్కడ నిర్మాణంలో ఉన్న ఓ ఇంటికి ఆర్‌సి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కుల్లాయమ్మ చీర కొంగు మిల్లర్‌లో ఉన్న ఓ ఇనుప రాడుకు చుట్టుకుంది. దీంతో కుల్లాయమ్మ మిషన్‌తో పాటు నాలుగైదు రౌండ్లు తిరిగి అపస్మారక స్థితిలో కింద పడిపోయింది. గమనించిన తోటి కూలీలు వెంటనే ఓ వాహనంలో ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కుల్లాయమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులోని చెరువు కట్ట సమీపంలో శుక్రవారం ఆటోని వెనుక నుంచి స్కార్పియో వాహనం ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు మండలం పాత కొత్తచెరువుకు చెందిన నవీన్, రామాంజనేయులు, అనిల్‌తో పాటుగా మరికొందరు తాడిపత్రిలో రైల్వే కూలి పనులు చేసేందుకు ఆటోలో బయలుదేరారు. అయితే గుత్తి సమీపంలోని చెరువు కట్ట సమీపంలో స్కార్పియో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో గాయపడ్డ నవీన్, రామాంజనేయులు, అనిల్ లను చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీ కొని వృద్ధుడికి..

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని శుక్రవారం ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పామిడి పట్టణం మార్కెట్‌కి చెందిన షెక్షావలి మన్రో సత్రం సమీపంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ షెక్షావలిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో ప్రతి క్లాస్ రూమ్‌లో ఫ్యాన్, మంచినీళ్లతో పాటు వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు హాజరవుతున్న దృష్ట్యా వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు కూడా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు పది నిమిషాలు ఆలస్యం అయినా అనుమతించాలని, గ్రామీణ విద్యార్థులకు పరీక్షల సమయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

'ఇంటింటికీ తెలుగుదేశం'లో జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-యాడికి

యాడికి మండల పరిధిలోని గుడిపాడు, కుందనకోట గ్రామాల్లో శక్రవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో తాడిపత్రి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తాగునీటి సమస్య ఉండేదని, మురుగునీరు రహదారుపై ప్రవహించేందన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి, జెసి దివాకర్‌రెడ్డి చలువతో సమస్య పరిష్కారమయిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. ఈ సందర్భంగా అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీరాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. మద్యపానం నిషేధిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఇప్పుడు గ్రామాల్లో ఎటు చూసినా నాటుసారా, బెల్ట్ షాపులు ద్వారా మద్యం అమ్ముతున్నారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలాంజనేయులు, మాజీ సర్పంచులు పుల్లయ్య, కొండయ్య, నారాయణరెడ్డి, శ్రీరాములు, మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు జగన్నాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లోకనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి నాయకులు పరిమి చరణ్, కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండవ సెమిస్టర్‌లో 'శ్రీసత్యసాయి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి -పెనుకొండ

గత సంవత్సరం అక్టోబర్ నెలలో నిర్వహించిన డిగ్రి రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రి కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ కె.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫలితాలలో 64శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారన్నారు. బిఎస్సీ, ఎంపిసిఎస్, ఫిజిక్స్ విభాగంలో కె. అనిత 8.28, పూజిత 8.20, బిజెడ్‌సిలో అనిత 8.20, పావని 7.7, మేనేజ్‌మెంట్ బిబిఎ విభాగంలో జోహ్రా ఫాతిమా 8.51, నవాజుద్దీన్ 8.28 పాయింట్లు సాధించారన్నారు. బికాం సిఎలో సి.ముఖేష్ 7.9, కె. మల్లేశ్వరి 7.5 పాయింట్లు సాధించారన్నారు., అంతేకాకుండా 20 మంది డిస్టెంక్షన్, 25శాతం కంటే ఎక్కువ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని చెప్పారుఅనంతరం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల ఏవో కేశవయ్య, అధ్యాపకులు వినోద్, వీణ, సంధ్య, జాహీర్, నవీన్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ఫ్యామిలీ గ్లోరీ ప్రోగ్రాం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేట బైపాస్‌లోని శ్రీ చైతన్య పాఠశాల ఎటిపి టెన్ బ్రాంచి లో ఫ్యామిలీ గ్లోరీ ప్రోగ్రాంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం జిల్లా శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు కలిగివుండాలన్నారు. తల్లిదండ్రులను దైవంగా భావించి వారిని నొప్పించకుండా క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత విద్యావంతులుగా ఎదగచ్చని తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల యొక్క మనోభావాలను అర్థం చేసుకొని వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులకు గులాబీ పూలతో స్వాగతం పలికారు. వారి పాదాలకు నమస్కరించి తాము స్వతహాగా తయారుచేసిన బహుమతులను తల్లిదండ్రులకు ఆప్యాయంగా ప్రేమగా అందజేశారు. తల్లిదండ్రులు విద్యార్థులను దీవించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలో ఇలాంటి ప్రోగ్రామ్స్ మనసుకు హత్తుకునేలా చేసి భావోద్వేగాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇలాంటి ప్రోగ్రామ్స్ ఎన్నెన్నో చేసి విద్యార్థులలో మంచి నడవడికను పెంపొందించాలని తెలిపారు. శ్రీ చైతన్య పాఠశాలల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాసులు, డీన్ సతీష్‌చ, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ గ్లోరీ ప్రోగ్రాంలో తల్లిదండ్రులు, విద్యార్థులు